ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 60 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 13 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# మీనాక్షి సీట్ చోరీకి బీజేపీ కుట్ర రాజకీయాలు

## శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ



**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి**

**తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు**

**కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు**

**తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు**

**హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా**

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్**

**ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి ...మిగతా 2లో



యథాతథంగా సింగరేణి

## మెడికల్ బోర్డు

### పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి

**అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ...మిగతా 2లో

## సర్ ప్రక్రియ.. ఓ భూతం లాంటిది

### చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ఖమ్మం, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

ఎస్ఐఆర్ సర్ ఆనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి ...మిగతా 2లో

ప్రజలు ఆమోదిస్తేనే

## పొలిటికల్ ఎంట్రీ

**నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్**



**ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు.** 2

చెన్నై,జూన్ 12 (ప్రభాత ఉదయం)



## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

### షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య 2

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

### ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం



**కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు**

**ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం**

**కరీంనగర్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం ...మిగతా 2లో

తిరుగుబాటు ఎంపిల

## కొత్త ఎత్తుగడ

**తమదే అసలైన టిఎంసిగా వాదన**

**స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందకు సన్నద్ధం**



**తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే 'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.** 2

- న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రభాత ఉదయం)

## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

### ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి

**రేవంత్‌కే ఫ్యూచర్ లేదు.. ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ**

**మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో ...మిగతా 2లో

## భారత నౌకలపై దాడులు ఇరాన్ పనే

2

# మీనాక్షి సీట్ చోరీకి బీజేపీ కుట్ర రాజకీయాలు

**మొదటి పేజీ తరువాయి**

కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరామహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరాఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# తిరుగుబాటు ఎంపిల కొత్త ఎత్తుగడ

**మొదటి పేజీ తరువాయి**

ఈ మేరకు లోకసేభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు. లోకసేభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్టుగా ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ గ్రూపులో శతాబ్దీ రారు, యూసుఫ్ పఠాన్, సయోనీ ఘోష్, శత్రుఘ్నసిన్హా తదితర ఎంపీలు ఉన్నారు.

# ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

**మొదటి పేజీ తరువాయి**

తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు
# రోజులు దగ్గర పడ్డాయి

**మొదటి పేజీ తరువాయి**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక



మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

# సర్ ప్రక్రియ.. ఓ భూతం లాంటిది

**మొదటి పేజీ తరువాయి**



పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.



## మీనాక్షికి సుప్రీంలో
# దక్కని ఊరట

**నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత**

**ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన**

**న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రభాత ఉదయం)**


రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరపున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

## వామన్ పల్లిలో ముగిసిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి,జూన్12(ప్రభాత ఉదయం)**



టీబీ ముక్త్ భారత్ అభియాన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడాలని వామన్ పల్లి గ్రామ సర్పంచ్ పర్నిక కృపాకర్ రెడ్డి తెలిపారు. ధరూర్ మండల పరిధిలోని వామన్ పల్లి గ్రామంలో వైద్య సిబ్బంది టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం శుక్రవారంతో విజయవంతమైంది. సందర్భంగా సర్పంచ్ పర్నికా రెడ్డి మాట్లాడుతూ.. టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిబి వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఉప సర్పంచ్ శిరీష, గ్రామ పెద్దలు నారాయణ రెడ్డి వైద్య సిబ్బంది, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా శ్రీలత బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

ఆర్టీసీ నూతన హైదరాబాద్ రీజినల్ మేనేజర్ గా శ్రీలత కాచిగూడలోని రజినీర్ ఆఫీస్ లో బాధ్యతలు స్వీకరించారు. స్వీకరించిన సందర్భంగా రో డిపో మేనేజర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో రంగారెడ్డి ని ఆర్.ఎం గా పనిచేసి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆర్ ఎం మాట్లాడుతూ.. డిపో మేనేజర్లు అందరూ అంకితభావంతో పనిచేసి ప్రయాణీకుల కు మెరుగైన సేవలందిస్తూ సంస్థ అభివృది, ఉద్యోగుల సంక్షేమం పైన శ్రద్ధ పెట్టాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనర్ మేనేజర్లు బాబూనాయక్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటనపై తీవ్ర ఆందోళన

**బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలి**

**గద్వాల జిల్లా ప్రతినిధి,జూన్12(ప్రభాత ఉదయం)**

ఖమ్మం టౌన్‌లో మహమ్మద్ గౌస్ పాషా అనే వ్యక్తి చేతిలో అత్యంత దారుణంగా లైంగిక దాడికి గురై, ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మైనర్ బాలిక ఆరోగ్యం పరిస్థితిపై విశ్వహిందూ పరిషత్ జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధితురాలికి మరియు ఆమె కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని శుక్రవారం గద్వాల జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు అల్లూరి ఫణి మోహన్ రావు, కార్యదర్శి సి.ప్రవీణ్ కుమార్ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.సమాజం తలదించుకునేలా జరిగిన ఈ ఘటనలో ప్రభుత్వం తూతూమంత్రంగా వ్యవహరించకుండా, బాధితురాలి పక్షాన నిలబడాలని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం టౌన్‌లో మహమ్మద్ గౌస్ చేతిలో లైంగిక దాడికి గురై, ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక హెల్త్ బులెటిన్‌ను ప్రభుత్వం రెగ్యులర్‌గా విడుదల చేసి, ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలి. బాధిత కుటుంబానికి తక్షణ ఖర్చుల క్రింద ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలి. బాధితురాలి పేరు మీద కోటి రూపాయలను ప్రభుత్వం బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలి.:బాలిక తల్లి లేదా తండ్రి ఇద్దరిలో ఒకరికి వారి విద్యార్హత ప్రకారం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన నిందితుడు మహమ్మద్ గౌస్ పాషాపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ (న్యాయ విచారణ) జరిపి, త్వరితగతిన ఉరి తీయాలి అని ప్రభుత్వాని డిమాండ్ వేశారుమ రాష్ట్రంలో మహిళలు, బాలికలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితుడిని కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు, సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని విశ్వహిందూ పరిషత్ అండగా నిలుస్తుందని వి.హెచ్.పి. నాయకులు హెచ్చరించారు



## భారత నౌకలపై దాడులు ఇరాన్ పనే

**న్యూఢిల్లీ, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై ఇటీవల దాడులు జరడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఇరాన్ ఆ దాడులకు పాల్పడిందని ఆరోపించిన ఆయన.. అమెరికా బలగాలే వాటిని అడ్డుకున్నాయని చెప్పారు. భారత నౌకలపై దాడులు ఏమాత్రం సమర్థనీయం కాదంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మరోవైపు, అమెరికాతో ఒప్పందం కుదిరిందని ఇరాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ నేతలకు నిజాయతీ లేదని, వాళ్లతో మంచి ఒప్పందం కష్టమేనన్నారు. ఆ దేశం వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై గత నాలుగు రోజుల్లో మూడు సార్లు దాడులు జరగ్గా.. ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

**మొదటి పేజీ తరువాయి**

మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు



గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోట ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

# సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానానికి అగ్రి వర్శిటీ దిక్సూచి కావాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

**హరిత విప్లవం లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్ర అమోఘం జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి**

**ఇందిరాగాంధీ పరిపాలన వ్యవసాయ రంగానికి స్వర్ణయుగం ప్రొఫెసర్ మధురా స్వామినాథన్**

**డాక్టర్ వై ఎస్ ఆర్, డాక్టర్ కే వీ పీ ఫౌండేషన్ తరపున రూ 21 లక్షల చెక్కు అందచేత**

**బుద్వేల్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**



హరిత విప్లవం సాధనలో ఇందిరా గాంధీ పాత్ర అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ మాజీ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ తదితరులు

తెలంగాణ కు, భారత దేశానికి గత 62 సంవత్సరాలుగా వ్యవసాయవిశ్వవిద్యాలయం అసమాన సేవలు అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ వర్శిటీ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా "భారతదేశ హరిత విప్లవ సాధన లో ఇందిరా గాంధీ విశేష సేవలు " అనే అం శంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ ల చేతుల మీదుగా ప్రారంభం అయిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ పంటలలో రూపొందించిన 520 వంగడాలు రైతుల మన్ననలను పొందాయన్నారు. అనేక మంది ని పట్టభద్రులుగా తీర్చిదిద్దిందన్నారు. ఇందిరాగాంధీ, స్వామినాథన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల తోడ్పాటు తో అమలు చేసిన హరిత విప్లవం కారణంగా నేడు అహార ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదిగిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వరి, మొక్కజొన్న పంటల ఉత్పత్తిలో రాష్ట్రం రికార్డు సాదించిందన్నారు. అనేక దేశాలలో పంటలకు విలువ జోడింపు, మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్, సెన్సార్ ఆధారిత వ్యవసాయ పద్ధతులు అవలంబిస న్నాయని మంత్రి వివరించారు. తెలంగాణ లో వ్యవసాయం సాంకేతిక, విలువ ఆధారిత వ్యవసాయం గా పరిణామం చెందాలని, అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం దిక్సూచి గా ఉ ండాలన్నారు.

**హరిత విప్లవం సాధనలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాత్ర**

**గొప్పది : జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి**

సదస్సు లో పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ఆవిర్భావ దినోత్సవ ప్రసంగం చేశారు. దేశం అహార భద్రత సాదించడంలో, నేడు అహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయి కి భారతదేశం చేరుకోవడానికి ఇందిరాగాంధీ అమలు చేసిన హరిత విప్లవం ప్రధాన కారణమన్నారు.

వ్యవసాయ వర్శిటీ వంటి సంస్థల స్థాపన అందుకు దోహదం చేసిందన్నారు. బ్యాంకులను జాతీయకరణ చేసి, నాబార్డు ని ఏర్పాటు చేసి రైతులకు, గ్రామీణ ప్రజానీకానికి చాలా మేలు చేశారన్నారు. అయితే ఇప్పటికి అనేక మంది పోషకాహార లోపంతో ఉండటం దురదృష్టకరమన్నారు. వ్యవసాయ రంగం నేడు ఏదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం మరింత కృషి చేయాలని సుదర్శన్ రెడ్డి పిలుపు నిచ్చారు.

**వ్యవసాయ పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి : ప్రొఫెసర్ మధురా స్వామినాథన్**

సదస్సు లో పాల్గొన్న బెంగుళూరు లోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ మధుర స్వామినాథన్ కీలకపోన్యాసం చేశారు. హరిత విప్లవం తర్వాత భారత దేశంలో ఉత్పత్తులు, దిగుమతులు బాగా పెరిగి ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామని ఆమె తెలిపారు. వ్యవసాయ సంస్థలకు, పరిశోధనలకు ప్రభుత్వాలు విస్తృతంగా ప్రోత్సాహం ఇవ్వాలని ప్రొఫెసర్ మధుర స్వామినాథన్ సూచించారు.

**విద్యావంతులు, మేధావి వర్గం దేశం కోసం ఆలోచించాలి : మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్**

పార్లమెంటు మాజీ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, నూనె గింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో భారత్ ఇంకా వెనుకబడి ఉందన్నారు. దేశంలో నేడు 80 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం పంపిణీ ఎందుకు చేయవలసి వస్తుందో ఆందరు ఆలోచిం చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని పరిస్థితులపై విద్యావంతులు, మేధావులు, చదువుకున్న ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

**డాక్టర్ వై ఎస్ ఆర్, డాక్టర్ కే వీ పీ ఫౌండేషన్ తరపున రూ 21 లక్షల అందచేత:**

డాక్టర్ వై.ఎస్.ఆర్, డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ తరపున రూ. 21లక్షల చెక్కును ఉండవల్లి అరుణ్ కుమార్ వ్యవసాయ వర్శిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కు అందజేశారు. ఈ డబ్బు మొత్తం పైన ప్రతి ఏటా వచ్చే వడ్డీ తో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థికి ప్రతి ఏటా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో లక్ష రూపాయల నగదు, సర్టిఫికెట్, మెడల్ అందించాలన్నారు.

**తెలంగాణ వచ్చాక వ్యవసాయం పై నిర్లక్ష్యం: రైతు కమిషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి:**

సదస్సు లో పాల్గొన్న తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం కోదండరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వచ్చాక వ్యవసాయంలో వెనుకబడి పోయామన్నారు. రాష్ట్రంలో పంట మార్పిడి పై రైతాంగంలో అవగాహన కల్పించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయం భూములను కాపాడేందుకు అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం : ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్**

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆస్తులను కాపాడుకోవడంలో అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అన్నారు. రాజకీయాలు, దేశం, పాలన కోసం విద్యావంతులు ఆలోచన చేయాలన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతి నివేధిక ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య చదివి వినిపించారు. సదస్సులో ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాల ఉ పకులపతులు డాక్టర్ దండ రాజిరెడ్డి, డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాశ్, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్రెడ్డి, భవానీ రెడ్డి, రాములు నాయక్, వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులకు, ఉత్తమ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, విద్యార్థులకు అవార్డులను అందజేశారు.

# విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి

**బుద్వేల్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**




విద్యుత్ షాక్ తో మరణించిన భూక్యా మిట్యా

విద్యుతో షాక్ తో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం కిస్మత్పూర్ దర్గా ఖలీజ్ ఖాన్ లో జరిగింది. వివరాలను రాజేంద్రనగర్ పోలీసులు వెల్లడించారు. ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. నిజామాబాద్ కు చెందిన భూక్యా మిట్య (54) కిస్మత్ పూర్ మ్యాజిస్టిక్ అపార్ట్మెంట్ లో స్వీపర్ గా పనిచేస్తాడు. అదే అపార్ట్మెంట్ లో దర్గా ఖలీజ్ ఖాన్ కు చెందిన గొల్లపల్లి శ్రీనివాస్ వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అపార్ట్మెంట్ కు సంబందించిన ఫ్లెక్సీ బోర్డును కిస్మత్ పూర్ రహదారిపై ఇద్దరు కలిసి ఓ భారీ నిచ్చెన సహాయంతో ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు నిచ్చెన 11కేవీ విద్యుత్ తీగెలకు తగిలింది. దీంతో భూక్యా మిట్య కు విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే క్రింద పడిపోయాడు. గొల్ల పల్లి శ్రీనివాస్ క్రింద ఉండటంతో పక్కకు పడి పోయాడు. స్థానికులు తీవ్ర గాయాలకు గురైన భూక్యా మిట్య ను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆయన మృతి చెందాడు. శ్రీనివాస్ స్వల్ప గాయాలతో చికిత్స పొం దుతున్నాడు. అపార్ట్మెంట్ యజమాని నిర్లక్ష్యం కారణంగా ఈ సంఘటన జరిగిందని పోలీసులు గుర్తిం చారు. ఎస్ఐ రాఘవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


# షాదీ ముబారక్ చెక్‌ల కోసం నకిలీ పెళ్లిళ్లు, నకిలీ పత్రాలు సృష్టించిన వారి గుట్టు రట్టు

**బుద్వేల్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

నకిలీ అధార్ కార్డులు, నకిలీ పెళ్లిళ్లు, అందుకు కావాల్సిన నకిలీ పెళ్లి పత్రికలతో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకుని లక్షలాది రూపాయలను కొల్లగొట్టడానికి ప్రయత్నించిన ముఠా సభ్యుల గుట్టును రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఒక రెవెన్యూ అధికారి, ఆరుగురు ఏజెంట్లు కలసి నకిలీ పత్రాలతో షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మీ పథకాలను కొల్లగొట్టాలని ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు ను అత్తాపూర్ పోలీసులకు అప్పగించగా, ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు నేతృత్వంలో ఈ కేసులో సంబంధం ఉన్నవారిని పిలిపించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. శనివారం నాటికి ఈ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారో గుర్తించి చర్యలు తీసుకునే పనిలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తుంది. రెవెన్యూ కార్యాలయంలో ఉన్న అధికారే ఈ వ్యవహారంలో ఏజెంట్లకు సహకరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ఎన్ని షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మీ పథకాలకు నకిలీ పత్రాలతో నిందితులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఇలా ఏమైన తీసుకున్నారా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం లోనే ఈ వ్యవహారం జరిగిందా.. రాజేంద్రనగర్ మండలంలో ఏమైన ఇలాంటి కేసులు ఉన్నాయా.. అనే కోణంలో సైతం అత్తాపూర్ పోలీసులు, టాస్కోర్స్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తాం అత్తాపూర్ ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు :**

నకిలీ పత్రాలతో షాదీ ముబారక్ చెక్కులను తీసుకోవాలని ప్రయత్నించిన కేసులో ప్రమేయం ఉన్న రెవెన్యయ అధికారులు, ఏజెంట్లను పిలిపించడానికి ప్రయత్నిస్తున్నాం. పూర్తి వివరాలు తీసుకునే ప్రయత్నంలో ఉన్నాం. శనివారం నాటికి పూర్తి సమాచారాన్ని మీడియా కు వెల్లడిస్తాం.




మన్నెశ్రీ భజన కీర్తనలు - పుస్తకం



మన్నె మహాత్మా రావు

# ఈ నెల 14న మన్నె శ్రీ భజన కీర్తనలు-2 ఆవిష్కరణ

**బుద్వేల్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

రచయిత, గాయకుడు, కవి మన్నెశ్రీ మహాత్మారావు రచించిన భజన కీర్తనలను ఈ నెల 14న ఆవిష్కరించనున్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నారు. కిస్మత్ పూర్ వాస్తవ్యులు, ప్రస్తుతం రాజేంద్రనగర్ లో నివాసం ఉంటున్న మన్నెశ్రీ మహాత్మారావు మొదటి నుంచి ఆధ్యాత్మిక జీవనం సాగిస్తు భక్తి పాటలు, కవిత్వాలు రాస్తుండేవారు. స్వతాహాగా ఆయన ఈఎస్ఐ లో ఉద్యోగి. అయినప్పటికి దైవభక్తి ఎక్కువ. ఇప్పటి వరకు అయన అనేక ఆధ్మాత్మిక పుస్తకాలను రచించి విడుదల చేశారు. 108 భజన పాటలతో గతంలో ఓ పుస్తకాన్ని రచించి విడుదల చేశారు. రెండవ సారి మరో 108 భజన గీతాల పుస్తకాన్ని ఈ నెల 14న కిస్మత్ పూర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో ఆవిష్కరించనున్నారు. ఈ పాటల పుస్తకాని కిస్మత్ పూర్ మాజీ ఉప సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ సహకారంతో ముద్రించారు. మన్నె మహాత్మా రావు రాజకీయ, సామాజిక గీతాలతో పాటు భజన గీతాలు, తత్వాలు, కాలజ్ఞానం పాటలు ఎంతో చక్కగా ఆలపించే మన్నెశ్రీ మహాత్మారావు ను ఇటీవల నంది అవార్డు తో ఓ సంస్థ సన్మానించింది.

# మ్యాన్ హోల్‌లో అస్తిపంజరం కలకలం

## దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**బుద్వేల్, జూన్ 12 (ప్రభాత ఉదయం) :**

కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డు లో గల మ్యాన్ హోల్ లో ఆస్తిపంజరం తేలడం కలకలం రేపింది. మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఈ విదంగా ఉన్నాయి... శుక్రవారం జీహెచ్ఎంసీ సిబ్బంది ఓల్డ్ కర్నూల్ రోడ్డులో మ్యాన్ హోల్ లు శుభ్ర పరిచే పనులు చేస్తున్నారు. ఒక మ్యాన్ హోల్ లో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఆస్తిపంజరం కనిపించింది. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ సిబ్బంది అధికారులకు తెలియజేశారు. వారు మైలార్దేవుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆస్తి పంజరాన్ని పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహం పురుషుడిదా.. లేదా స్త్రీ దా.. అనే విషయంపై ఫోరెన్సిక్ పరీక్షలు, దర్యాప్తు అనంతరం మాత్రమే తేలుతుందనిఇ పోలీసులు తెలిపారు. ఆస్తిపంజరం మ్యాన్ హోల్ లోకి ఎలా చేరింది.. దాని వెనుక ఏమైన అనుమానస్పద పరిస్థితులు ఉ న్నాయా.. అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఈ సంఘటన స్థానికంగ చర్చనీయాంశమైంది.

# నర్సాబాయి కుంట రిటర్నింగ్ వాల్ నిర్మాణం త్వరలో పూర్తి చేస్తాం : ఈఈ వెంకటశేషయ్య

**రాజేంద్రనగర్, జూన్ 12(ప్రభాత ఉదయం)**




మార్కండేయనగర్ శ్రీవీరాంజనేయస్వామి దేవాలయం వెనుక వైపు ఉన్న నర్సాబాయి కుంటకు రిటర్నింగ్ వాల్ నిర్మాణ అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయడానికి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకటశేషయ్య తెలిపారు. నిత్యం భక్తలకు ప్రమాదాలను పంచడంతో పాటు అపరిశుభ్రతకు కారణమవుతున్న ప్రాంతాన్ని సర్వే చేసినట్లు ఆయన తెలిపారు. ఇటీవల మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఉమ్మడి దేదాలయ కమిటీలతో పాటు స్థానిక సత్యసాయి పొదుపు సంఘం ప్రతినిధుల బృంధం ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ సిఫారసుతో ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు రాజేంద్రనగర్ జోనల్ కమీషనర్ ఇతర అధికారులకు కుంటను పార్కుగా అభివృద్ధి చేయడంతో పాటు దేవాలయ వద్ద ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో రిటర్నింగ్ వాల్ నిర్మించాలని వినతిప్రతాలు సమర్పించిన విషయం విధితమే. దాంతో పాటు స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నర్సాబాయి కుంటను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాధనను అధికారుల బృంధంతో ఆయన స్వయంగా పరిశీలించిన విషయం తెలిసిందే. కాగా, ఎమ్మెల్యే పర్యటన అనంతరం కనీసం సర్వే చేయడానికి కూడా శాఖల మధ్య కొరవడిన సమన్వయ లోపాలను గ్రహించిన ప్రకాష్ గౌడ్ మరోమారు అధికారులకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈఈ వెంకటశేయ్య ఏఈ వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రెడ్డి తో కలసి శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయం వెనుక భాగంలో నర్సాబాయి కుంటను పరిశీలించారు. అనంతరం ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి కోతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఈఈ వెంటకశేషయ్య మాట్లాడుతూ త్వరంలోనే నర్సాబాయి కుంటను సుందరమైన పార్కుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జోనల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జోన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నారేందర్‌గౌడ్ ఆదేశాలతో కావలసిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 70 మీటర్ల మేర వీరాంజనేయ దేవాలయం వెనుకభాగంలో భారీ ఎత్తులో సమస్య శాశ్వత పరిష్కార దిశగా రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పగిడిమర్రి సూర్య నారాయణ, శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గద్దె యాదగిరి ప్రతినిధులు కోట పవన్, రావుల నవీన్, గంజి విజయ్ తదితరులు పాల్గొన్నారు.


# ఏడు దశాబ్దాలుగా ప్రజలను అహ్లాద పరుస్తున్న కిద్వాయ్ కాటేజ్



కిద్వాయ్ కాటేజ్ లో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లు




కిద్వాయ్ కాటేజ్



ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చిక బయళ్ళు





భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నాటిన అశోక వృక్షం

**హెచ్ఎండీఏ అధికారుల సహకారంతో గార్డెన్ల పునరుద్ధరణ**

**బుద్వేల్, జూన్ 12 ( ప్రభాత ఉదయం)**

పచ్చని చెట్లు, అహ్లాదకరమైన వాతావరణం, పక్షుల కిలకిల రావాలు, పక్కనే ఈసా కాలువ జలపాతాలతో సందర్శకులను ఆహ్లాద పరుస్తున్న రాజేంద్రనగర్ లోని కిద్వాయ్ కాటేజ్ ను హెచ్ఎండీఎ అధికారులు అభివృద్ధి చేశారు. ఆ పనులను శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో కలసి ప్రారంభించారు. గత కొంత కాలంగా సరైన ఆదరణ లేక శిధిలావస్తకు చేరుకున్న కిద్వాయ్ కాటేజ్ కు రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. నీటి అవసరాలు తీర్చడానికి బోరు వేశారు. హెచ్ఎండీఎ సహకారంతో పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు.





**అశోక మొక్కను నాటి న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ :**

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన రఫీ అహ్మద్ కిద్వాయ్ అప్పట్లో మధిర గా పిలువడే ప్రాం తంలో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతానికి వచ్చారు. ఆ సందర్భంగా ఆయన పేరుతో ఒక కాటేజ్ ను నిర్మాణం చేశారు. ఆ ప్రాంతానికి 1955 జూలై 4వ తేదీన భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రనగర్ ప్రసాద్ వచ్చి అశోక వృక్షాన్ని నాటారు. ఆనాటి నుంచి మధిర గా పిలువబడుతున్న ప్రాం తానికి రాజేంద్రనగర్ అని పిలువడం ప్రారంభించారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నాటిన అశోక వృక్షం నేడు అనేక మందికి సేద తీర్చేదిగా ఉంది. ఎవరు కిద్వాయ్ కాటేజ్ కు వచ్చిన ఆ చెట్టు పరిసరాలలోనే భోజనాలు చేసి సేద తీరుతుంటారు.

# గచ్చిబౌలి 'రాయల్ స్పైస్' రెస్టారెంట్ సీజ్!

**ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో ఘోర ఉల్లంఘనలు**

**కిచెన్ నిండా పురుగులు.. కుళ్లిన మాంసం స్వాధీనం**

**హైజీన్ స్కోరు వందకు 20 మార్కులే.. హోటల్ మూసివేతకు ఆదేశం**

**శేరిలింగంపల్లి : జూన్ 12, (ప్రభాత ఉదయం)**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐటీ కారిడార్ ప్రజలే లక్ష్యంగా నడుస్తున్న ప్రముఖ హోటళ్లలో వడ్డించే వంటకాల వెనుక ఉన్న 'అశుభ్ర' భాగోతం మరోసారి బట్టబయలైంది. గచ్చిబౌలిలోని 'రాయల్ స్పైస్' రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారులు శుక్రవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు తీవ్ర కలకలం రేపాయి. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, కనీస పరిశుభ్రత పాటించని ఈ రెస్టారెంట్‌ను అధికారులు తాత్కాలికంగా సీజ్ చేశారు.గచ్చిబౌలి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ సమీపంలో ఉన్న రాయల్ స్పైస్ రెస్టారెంట్‌పై సిఎంసి ఫుడ్ సేఫ్టీ బృందాలు మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో కిచెన్ లోపలి దృశ్యాలు చూసి అధికారులే విస్తుపోయారు. వంటగది నిండా భారీగా పురుగులు పాకుతూ కనిపించాయి. వాష్ ఏరియా, డైనింగ్ హాల్, కిచెన్ అంతటా ఆహార వ్యర్థాలు పేరుకుపోయి, నీరు నిల్వ ఉండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఇక అపరిశుభ్ర వాతావరణంలో ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన కుళ్లిన మాంసాన్ని గుర్తించిన అధికారులు. దాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.

**ప్రధాన ఉల్లంఘనలు**

కస్టమర్లను ఆకర్షించేందుకు ఆహార తయారీలో అనుమతించిన దానికంటే విపరీతంగా ఫుడ్ కలర్స్



రాయల్ స్పేస్ రెస్టారెంట్ తనిఖీ చేస్తున్న సీఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు.

వాడుతున్నారు. వండే ఆహార పదార్థాల పక్కనే మూతలు లేని చెత్తబుట్టలను ఉంచారు. దీంతో ఈగలు, పురుగులు వాలి ఆహారం కలుషితం అవుతోంది. వంటల కోసం వాడుతున్న నీటి నాణ్యతకు సంబంధించిన ఎలాంటి ధృవపత్రాలు యాజమాన్యం వద్ద లేవు. గోడలు, కిటికీలు జిడ్డు పట్టి, బూజుపట్టి దర్శనమిచ్చాయి.

**వందకు 20 మార్కులే..**

రెస్టారెంట్‌లోని పరిస్థితులను బట్టి అధికారులు


తనిఖీల్లో వెలుగు చూసిన పాడైపోయిన మాంసం,చికెన్ తదితర సామాగ్రి..

నిర్వహించిన హైజీన్ (పరిశుభ్రత) అంచనాలో రాయల్ స్పైస్ ఘోరంగా విఫలమైంది. మొత్తం 96 మార్కులకు గాను ఈ హోటల్ కేవలం 20 మార్కులు మాత్రమే సాధించింది. అంటే పరిశుభ్రత శాతం కేవలం 18 శాతంగా నమోదైంది. ప్రజారోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్న ఈ రెస్టారెంట్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హోటల్‌ను పూర్తిగా మూసివేయాలని (తాత్కాలికంగా సీజ్) ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే ఇలాంటి హోటళ్లపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.


వాటర్ లాగిన్ పాయింట్లు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ తో పాటు ఇతర అధికారులు..

## వర్షం వస్తే రోడ్లపై నీళ్లు నిలవొద్దు

**శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్**

**మల్కాం చెరువు, వాటర్ లాగింగ్ పాయింట్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జెడ్సీ**

**హైడ్రా, ఇంజనీరింగ్, సాగునీటి శాఖల అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన**

**శేరిలింగంపల్లి : జూన్ 12, (ప్రభాత ఉదయం)**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రోడ్లపై ఎక్కడికక్కడ నీరు నిలిచే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా యంత్రాంగం కదిలింది. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని ప్రధాన వాటర్ లాగింగ్ (నీరు నిలిచే) ప్రాంతామైన మల్కం చెరువును జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధికారుల బృందంతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు.ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ వెంట స్థానిక ఉప కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం, హైడ్రా, సాగునీటి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తనిఖీల్లో భాగంగా అధికారులు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను డ్రైనేజీ నాలాల ప్రవాహ మార్గాలను నిశితంగా పరిశీలించారు. వర్షపు నీరు ఎక్కడా నిలిచిపోకుండా సాఫీగా ముందుకు సాగిపోయేలా తీసుకోవాల్సిన సాంకేతిక మార్పులపై చర్చించారు. ముఖ్యంగా మల్కాం చెరువు పరివాహక ప్రాంతాల్లో తుఫాను నీటి నిల్వ సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన నివారణ చర్యలను జెడ్సీ అధికారులకు వివరించారు.

**శాఖల మధ్య సమన్వయం ముఖ్యం : జెడ్సీ**

ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ వాటర్ లాగింగ్ ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాలు పడినప్పుడు ప్రజలు ఇబ్బంది పడకుండా చూడటమే మన మొదటి ప్రాధాన్యత. ఇందుకోసం హైడ్రా, ఇంజనీరింగ్, ఇరిగేషన్ శాఖలు ఒకరితో ఒకరు సమన్వయంతో పనిచేయాలి. వరద ఉపశమన చర్యలను మరింత బలోపేతం చేసి నగరవాసులకు ముంపు ముప్పు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా పనులను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని ఆయన స్పష్టం చేశారు.



## ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. నగదు మరియు ఆటో స్వాధీనం**

**మల్దకల్, జూన్ 12(ప్రభాత ఉదయం)**

మల్దకల్ మండల కేంద్రంలోని ఒక ఎలక్ట్రికల్ దుకాణంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మల్దకల్ ఎస్ఐ శ్రీహరి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.ఈనెల 8వ తేదిన సోమవారం రాత్రి మల్దకల్ మండల కేంద్రంలోని "సిరి ట్రేడర్స్ ఎలక్ట్రికల్" దుకాణంలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ. 53,000 నగదును అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట స్టేజ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులను అదుపులోకి తీసుకుని విచారించారు. కర్నూలు ప్రాంతానికి చెందిన ఎం.వంశీ , మాల వెంకటేష్ ఇద్దరు కలిసి ఎలక్ట్రికల్ దుకాణంలో దొంగతనానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల వద్ద నుండి రూ. 40,200 నగదు, దొంగతనానికి ఉపయోగించిన ఆటో (ఏపీ-39-టీ-0761), మరియు తాళాలు పగులగొట్టడానికి వాడిన రెండు స్పానర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను ఇద్దరిని అరెస్టు చేసి శుక్రవారం గద్వాల కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అభినందించారు.

# పోలీస్ 'ఫ్రెండ్లీ' క్రీడా స్ఫూర్తి: ఖాకీల హోరు.. ప్రెస్ జోరు!

**ఘనంగా ముగిసిన సైబరాబాద్ క్రికెట్ లీగ్--2026**

**క్రైమ్ వారియర్స్ పై పోలీస్ హంటర్స్ ఘన విజయం; అద్వైత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', నరేష్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'**

**శేరిలింగంపల్లి : జూన్ 12, (ప్రభాత ఉదయం)**

నిరంతర ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే ఖాకీలు, సమాజ శ్రేయస్సు కోసం నిత్యం శ్రమించే కలం యోధులు ఒక్కటయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ, వార్తా సేకరణల హడావుడిని పక్కనబెట్టి బ్యాట్, బాల్ చేతబట్టి మైదానంలో క్రీడా స్ఫూర్తిని చాటారు. సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన 'సైబరాబాద్ ప్రెస్ అండ్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్--2026' అత్యంత వైభవంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ హంటర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది.

**ఏకపక్షంగా సాగిన ఫైనల్.. హంటర్స్ హవా!**

సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ హంటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 224 పరుగుల భారీ స్కోరు సాధించింది. హంటర్స్ బ్యాటర్ అద్వైత్ మైదానంలో ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడి 92 పరుగులతో దూకుడైన ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం 225 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన 'క్రైమ్ వారియర్స్' జట్టు.. పోలీస్ హంటర్స్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక చేతులెత్తేసింది. కేవలం 73 పరుగులకే ఆలౌట్ కావడంతో పోలీస్ హంటర్స్ జట్టు ఘన విజయం సాధించి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా బ్యాటింగ్‌లో 92 పరుగులు చేయడమే కాకుండా, బౌలింగ్‌లోనూ 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చిన అద్వైత్ అవార్డును దక్కించుకున్నారు.

టోర్నమెంట్ అంతటా నిలకడగా రాణించి 180 పరుగులు సాధించిన పోలీస్ హంటర్స్ ప్లేయర్ నరేష్ కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, అవార్డులను అందజేసిన అనంతరం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పోలీస్ శాఖ అయినా, మీడియా రంగమైనా 24 గంటలూ తీవ్ర ఒత్తిడితో కూడుకున్నవి. రాత్రి పగలు తేడా లేకుండా పనిచేసే ఈ రెండు వర్గాల మధ్య పరస్పర అవగాహన, స్నేహపూర్వక వాతావరణం మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతోనే ఈ లీగ్ నిర్వహించామాని తెలిపారు. 10 జట్లతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన నిర్వాహకులకు, మీడియా



విజేతలకు ట్రోఫీనందిస్తున్న సైబరాబాద్ సీపీ రమేష్.

ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల కోరిక మేరకు భవిష్యత్తులో బ్యాడ్మింటన్ వంటి ఇతర క్రీడా పోటీలను కూడా నిర్వహిస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఈ ముగింపు వేడుకల్లో సీపీతో పాటు అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీలు హనుమంతరావు, షమీర్, ఆర్‌ఐలు ఇతర ఉన్నతాధికారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## దేవరకద్ర నియోజకవర్గం డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిందాం

**యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.**

**మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత.**

**కొత్తకోట, జూన్ 12(ప్రభాత ఉదయం)**

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు.దేవరకద్ర నియోజకవర్గం : కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో డ్రగ్స్ కు (మాదక ద్రవ్యాలకు) వ్యతిరేకంగా వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2ఖ రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న వనపర్తి జిల్లా కలెక్టర్, ఎస్పీ , దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ గారు మాట్లాడుతూ...ఒకప్పుడు విదేశాలకు పరిమితమైన డ్రగ్ సంస్కృతి, మన ప్రాంతాలకు వ్యాపించింది.డ్రగ్స్ బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.డ్రగ్స్ కు బానిసలై కొంతమంది యువత ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.గతంలో డ్రగ్స్ వ్యాప్తి ఉధృతంగా ఉండేది, దానిని కంట్రోల్ చేసేందుకు, డ్రగ్స్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఉన్న నార్కోటిక్ బ్యూరోను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి (ఈగల్) ఫోర్సును ఏర్పాటు చేశారు.డ్రగ్స్ పై ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో పౌరులుగా మనమందరం డ్రగ్స్ నిర్మూలనలో భాగమై, డ్రగ్స్ తీసుకుంటున్న వారి వివరాలను, డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలి.డ్రగ్స్ పై సమాచారం ఇచ్చిన పౌరుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతాం.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ శాఖకు ధన్యవాదాలు.మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని మానసికంగా, ఆర్థికంగా నాశనం చేస్తుంది, మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత, డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం అందరం కృషి చేద్దాం.తదనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి

**నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష , రూ.20వేల జరిమానా!**

**నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(ప్రభాత ఉదయం)**



మైనర్ బాలికను బలాత్కారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష , 20 వేల రూపాయాల జరిమాన విధిస్తూ ప్రిన్సిపాల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జ్ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ్ వి. శ్రీనివాస్ శుక్రవారం తీర్పును వెల్లడించారు.అలంపూర్ మండలలో ఒక గ్రామము చెందిన ఒక మహిళ తేది:28.04.2021 నాడు అలంపూర్ పోలీస్ స్టేషన్ కు వచ్చి మైనర్ అయిన తన కూతురు పై 2021 ఏ నది ఏప్రిల్ 27 రోజున సాయంకాలం మేకలను మోపుతుండగా, పింజరి పెద్ద హుస్సేన్ అలియాస్ నడిపి హుస్సేన్ వయసు 35 సంవత్సరాలు, కులం పింజరి, వృత్తి వ్యవసాయం, అల్లంపూర్ మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి తన కూతుర్ని బలాత్కారం చేసి అత్యాచారం చేసినట్టు పిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్సై ఎస్. మధుసూదన్ రెడ్డి, క్రైమ్ నెశీ. 42/2021, బ/o: 376 (దీ) ఖ్రాజ ఉంవష 5(వీ), 6 శీట్రాజుూాషి -2012 గా కేసు నమోదు చెయ్యగా అప్పటి సిఐ. ఎమ్. వెంకటరామయ్య విచారణ చేయడం జరిగింది. కొద్ది రోజులకు సి.ఐ. వెంకటరామయ్య ట్రాన్సర్ కాగా కొత్తగా వచ్చిన సిఐ ఏ.సూర్య నాయక్ విచారణ పూర్తి చేసి, కోర్టు లో చార్జి షీట్ వెయ్యడం జరిగింది. కోర్టు లో ట్రయల్స్ నడుస్తున్న సమయంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్ ఆదేశాల మేరకుడి.ఎస్పి మొగిలయ్య పర్యవేక్షణలో, అలంపూర్ సీఐ వి. ప్రదీప్ కుమార్, అలంపూర్ ఎస్సై ఎమ్. రామకృష్ణ, గద్వాల భరోసా కేంద్రం బృందం సాక్షులను పకడ్బందీగా బ్రీఫింగ్ చేసి తగిన చర్యలు తీసుకొని నేరస్తులను కోర్టులో ప్రవేశపెట్టగా పూర్వపరాలను విన్న లిప్రిన్సిపాల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జ్ - కం- ఫోక్సో కోర్టు గద్వాల, జడ్జ్ వి. శ్రీనివాస్ నిందితుడుకి 20 సంవత్సరాల కఠిన కారాగర శిక్ష జైలు శిక్ష మరియు 20,000/- వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.కోర్టులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు వెంకటరామయ్య, సూర్య నాయక్, ప్రస్తుత డి. ఎస్పీ మొగిలయ్య, సీఐ వి ప్రదీప్ కుమార్, ఎస్సై రామకృష్ణ, అడిషనల్ పిపి. కె.విజయ్ కుమార్, గద్వాల భరోసా కేంద్రం బృందం మరియు కోర్టు డ్యూటీ అధికారులు ఎస్సై జిక్కి బాబు, హెడ్ కానిస్టేబుల్ సాయి బాబా, కానిస్టేబుల్ మాభాషలను లిజిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు, అభినందించారు.

## కూకట్ పల్లిలో తహసిల్దార్ అశోక్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి

**కూకట్ పల్లి, జూన్ 12 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి నూతన తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ నీ వెంకటేశ్వర నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా ఇతర నాయకులతో కలిసి శాలువతో సత్కరించి పూల ఓకే అందించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలు శ్రీధర్ రెడ్డి ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి తో పాటు కాలనీలోని సీనియర్ నాయకులు ఈరెడ్డి దేవేందర్ రెడ్డి, ఎడ్ల సంపత్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# తాపీ మేస్త్రిని హటావ్...సెంట్రింగ్ కాంట్రాక్టర్స్‌కు బచావో అన్న నినాదాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి

**తాపీ మేస్త్రీలకు సెంట్రింగ్ మేస్త్రీలు బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**క్షమాపణ చెప్పేంతవరకు భవన నిర్మాణ పనులకు వెళ్లే ప్రసక్తే లేదు**

**ర్యాలీ, నిరసన తెలిపిన భవన నిర్మాణ కార్మికులు**

**కూకట్ పల్లి, జూన్ 12 (ప్రభాత ఉదయం)**




మే 16న సెంట్రింగ్ కాంట్రాక్ట్స్ కార్మికులు పనులు బందు పెట్టి తాపీ మేస్త్రిని హటావ్ కాంట్రాక్టర్స్ కు బచావో అన్న నినాదాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనియెడల భవన నిర్మాణ పనులను బంద్ చేసి వాళ్ళు క్షమాపణ చెప్పేంతవరకు భవన నిర్మాణ పనులకు వెళ్ళమని భవన నిర్మాణ కార్మికులు తేల్చి చెప్పేశారు. శుక్రవారం మేస్త్రి సంఘాల రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కమల ఐలయ్య ఆదేశాల మేరకు అస్బెస్ట్ అస్ కాలనీ సంఘం అధ్యక్షుడు పి బాలాజీ, ఆల్విన్ కాలనీ సంఘం అధ్యక్షుడు అంకమ్మరాజు, జగద్గిరిగుట్ట సంఘం అధ్యక్షుడు మహేందర్ రెడ్డి లతోపాటు భవన నిర్మాణ కార్మికుల సంఘాల ఆధ్వర్యంలో గుబురు గుట్ట నుండి జగద్గిరిగుట్ట బస్టాండ్ వరకి కాలినడకన ర్యాలీని నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్ట్ కార్మికులు వాళ్ళ రేట్లు పెంచడం గురించి ఆలోచించకుండా తాపీ మేస్త్రీలను తోటి కార్మికులు అని ఆలోచించకుండా అవహేళనగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. తాపీ మేస్త్రీలు మా ఆత్మగౌరవం దెబ్బతిన్నదని అందుకే మేము పనులు బందు పెడుతున్నామని తెలిపారు. సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ మమ్మల్ని ఎక్కడైతే అవహేళనగా మాట్లాడారో అక్కడే క్షమాపణ చెప్పకపోతే ఎన్ని రోజులైనా సరే పనుల్లోకి వెళ్లకుండా ఉంటామని వారిని హెచ్చరించారు. కార్మికులారా ఏకం కావాలి అనే ఒక నినాదం మర్చిపోయి కార్మికులను కొందరు శక్తులు విడదీయాలని చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అస్బెస్ట్ అస్ కాలనీ భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్వైజర్ బుల్లెట్ రాజు, కార్యదర్శి శ్రీనివాస్, నరసింహ, మునీశ్వర్, రాంబాబు, శివకుమార్, ఇజ్రాయిల్, ఎండి యూసుఫ్, మాధవరావు, గుంటూరు శ్రీనివాస్, శేఖర్, టి కృష్ణ తదితరులు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం:

## డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ధనుంజయ్



**రాజేంద్రనగర్, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మైలార్ దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్ ధనుంజయ్ అన్నారు. శుక్రవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవతో 28.లక్షలతో సిసి రోడ్డు చేపట్టనున్న సిసి రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులుటి. ప్రేమ్ గౌడ్, సరికొండ వెంకటేష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాశి గారి యాదగిరిబాస. శ్రీనివాస్ బొల్లి గట్టయ్య కల్లెం లక్ష్మారెడ్డిబండారి యాదగిరి రామకృష్ణారెడ్డి, లలితా రెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# తిరుగుబాటు ఎంపిల కొత్త ఎత్తుగడ

**తమదే అసలైన టిఎంసిగా వాదన**

**స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందకు సన్నద్ధం**

**న్యూఢిల్లీ,జూన్12(ప్రభాత ఉదయం)**

తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే 'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు.

ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు.

# సమస్యలను తీర్చాలని లేని ఎడల మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తా

## బోయినపల్లి డివిజన్ లోని సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం

## కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, జూన్ 12 (ప్రభాత ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గం, బోయిన్ పల్లి వార్డ్ ఆఫీసులో డి.సి డాకు నాయక్, మాజీ కార్పొరేటర్ ముద్దాం నరసింహ యాదవ్, అన్ని విభాగాల అధికారులతో కలిసి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బోయిన్ పల్లి డివిజన్ లోని కాలనీ అసోసియేషన్ వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కరించే విధంగా అక్కడికక్కడే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గాన్ని మూడు భాగాలుగా చేసి అభివృద్ధికి ఆటంకం కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ ఉన్న ప్రాంతాలను మల్కాజ్గిరి జోన్ లో కలపడం వల్ల అధికారులకు సమన్వయ లోపం జరిగి పనుల్లో ఇబ్బంది జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వివరించారు. కోయబస్తీలో వాటర్ బోరు పనిచేయక ఇబ్బంది పడుతున్నామని, అలాగే విటల్ ఎంక్లేవ్ లో డ్రైనేజ్ సమస్య, అస్మత్పేట స్మశాన వాటిక అభివృద్ధి, అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు, వాటర్ పైపు లైన్లు ఇబ్బంది, నీటి ప్రెజర్ రాక ఇబ్బందులు ఇలా అనేక సమస్యలను అసోసియేషన్ సభ్యులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సత్వరమే వారు అందించిన సమస్యలను తీర్చాలని లేని ఎడల మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేయడానికి అయినా వెనుకాడను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, నాయకులు బలవంత రెడ్డి, మక్కల నర్సింగరావు, హరినాథ్, జంగయ్య, యాదగిరి, నరేంద్ర గౌడ్, లలిత గౌడ్, కర్రె లావణ్య, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అర్హులైన వారందరికీ అక్రిడియేషన్ కార్డులు మంజూరు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(ప్రభాత ఉదయం)**

2026 -2028 సంవత్సరానికి సంబంధించిన జర్నలిస్టుల ఆక్రెడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, జ్యోతి శ్రీనివాసులు, నల్లన్న, అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, నల్లన్న, వెంకటేష్, సిరాజుద్దీన్, భీమ రాయుడు, జాన్, తదితరులు పాల్గొన్నారు.



# న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం

**కూకట్ పల్లి బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్**

**కూకట్ పల్లి, జూన్ 12 (ప్రభాత ఉదయం)**

దివ్యాంగులకు న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కూకట్ పల్లి బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్ చైతన్య బస్తీలో నివాసం ఉంటున్న మోతె ఎల్లమ్మ పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ వారు ఆమెకు వీల్ చైర్ ను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిఖిల్ కుమార్ మాట్లాడుతూ న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ ప్రతినిధులు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో వారు చేపట్టే కార్యక్రమాలకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుకారాం, న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వెంకట్ స్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, అనంత్ గౌడ్, రాంచందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 12(ప్రభాత ఉదయం)**

అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని, ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డిప్ విధానంలో కలెక్టర్ ఎంపిక చేశారు. నాన్ రెసిడెన్షియల్ ఒకటవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 57 సీట్లు ఉండగా, మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మహిళా రిజర్వేషన్స్, జనరల్ కోటాలో నిబంధనల ప్రకారం డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. రెసిడెన్షియల్ ఐదవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 59 సీట్లు ఉండగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మొత్తం 310 మంది దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిలో నుంచి డిప్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేశారు. వివిధ గ్రూపులకు సంబంధించి వెయిటింగ్ లిస్టు ప్రాతిపదికన కొంతమంది విద్యార్థులను కూడా డిప్ విధానంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, ఏఎస్సిడబ్ల్యూఓ నాగరాజు, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, బీచుపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రామాంజనేయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.